క్లుప్తంగా

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి



శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటంవద్ద నివాళుల ర్పిస్తున్న నాయకులు

వేంపల్లె : పట్టణంలోని స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ సీనియర్ నేత దాసరి రవిశంకర్ ఆధ్వర్యంలో వేంపల్లెలోని తన కార్యాలయంలో జనసేన నాయకులు శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అంటూ తెలుగు భాష జాతి వైభవాన్ని నలుమూలలా చాటి చెప్పిన విజయనగర సామ్రాజ్య వీరులు, అఖండ భారత మహా చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని కొనియాడారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

29న టెంకాయలు అమ్ముకునేందుకు వేలం

చింతకొమ్మదిన్నె : కొత్తపేట గంగమ్మ గుడి ఆవరణలో సంవత్సరం టెంకాయలు విక్రయించుకునేందుకు ఈనెల 29వ తేదీ ఉదయం 11.00 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు గంగమ్మ దేవస్థానం ఈవో రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. టెండరుదారులు నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఎర్రగుంట్ల : మండల పరిధిలో విద్యుత్ సరఫరా శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉండదని ఏపీఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్, హనుమనుగుత్తి రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డు, కడప రోడ్డు, వేంపల్లి రోడ్డు, కేవీపల్లి, మాలెపాడు, చిన్నదండ్లూరు, ఆర్టీపీపీ, కలమల్ల తదితర ఏరియాలలో విద్యుత్ సరఫర ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

చక్రాయపేట..

చక్రాయపేట : మండలంలోని చక్రాయపేట, మహదేవపల్లె, కె.రాజుపల్లె, కె.ఎర్రగుడి సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మరమ్మతుల కారణంగా ఎల్‌సీ తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రైతులు, వినియోగదారులు సహ కరించాలన్నారు.

పింఛన్లను తనిఖీ చేసిన వైద్య బృందం



లబ్ధిదారుడి వివరాలను తెలుసుకుంటున్న ప్రత్యేక వైద్య బృందం

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా పెరాలసిస్‌తోపాటు మంచానపడి రూ.15 వేల పింఛన్ పొందుతున్న పింఛన్ లబ్ధిదారులను శుక్రవారం ప్రత్యేక వైద్య బృందం తనిఖీలు నిర్వహించారని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మండల వ్యాప్తంగా 35 మంది పింఛన్ లబ్ధిదారులు అర్హత కలిగి ఉన్నారా లేదా అని వైద్య బృందం పరిశీలించింది. అందులో బిదినంచర్ల 4, గురిజాల 2, హిమకుంట్ల 3, కసనూరు 3, సింహాద్రిపురం-1లో 4, సింహాద్రిపురం-2లో 1, సుంకేసుల 4, లోమడ 5, కోవరంగుంటపల్లిలో 4, బలపనూరు 4 పింఛన్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య బృందం పరిశీలించిందన్నారు. వీరి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అర్హత ఉంటే పేర్లు ఉంటాయని, అనర్హత ఉంటే పింఛన్ తొలగిపోతుందన్నారు.

ఆలయ భూముల విచారణపై క్షేత్రస్థాయి పరిశీలన

ఎర్రగుంట్ల : మండలంలోని కలమల్ల గ్రామంలో శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయ భూముల వివాదంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్, తహసీల్దార్ శోభన్‌బాబులు ఆలయ భూముల విచారణపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ మేరకు పాత కలమల్ల గ్రామంలోని ఆలయ కమిటీ సభ్యులతో, కొత్త కలమల్ల గ్రామంలోని ఆలయ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇరువర్గాల వారు చూపించిన రికార్డులను పరిశీలించారు. దేవదాయ శాఖ, రెవెన్యూ శాఖల రికార్డులను పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామన్నారు.

దౌర్జన్యాలు మానుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కూటమి పాలకులు అక్రమాలు, దౌర్జన్యాలు మానుకోవాలని, ఇప్పటికైనా తమ పద్ధతులు మార్చుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి హితవు పలికారు. నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొన్న మద్యం టెండర్లు, నేడు ఇసుక, గనులు, టెండర్లలోనూ వారి దౌర్జన్యాలు బయటపడ్డాయన్నారు. ప్రజలకు సేవలందిస్తారని అధికారాన్ని కట్టబడితే వారి సొంత ప్రయోజనాలకు ఆస్తులు కూడబెట్టుకుంటున్నారన్నారు.

మండలంలో రేషన్ డీలర్లదే హవా..!

- ఎక్కడా తిరగని రేషన్ పంపిణీ వాహనాలు
- నెలనెలా ప్రభుత్వం నుంచి వేతనాలు మంజూరు



నిలిచిపోయిన ఎండీయూ వాహనాలు

వేంపల్లె : మండల వ్యాప్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థను నడుపుతున్న రేషన్ డీలర్లదే హవా నడుస్తోంది. మండలంలో రేషన్ పంపిణీ వాహనాలు ఎక్కడ కూడా తిరగడం లేదు. అయితే ఎండీయూ ఆపరేటర్లకు ప్రతి నెలా వేతనం తమ అకౌంట్లలో జమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రతి పేదవాడి ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ఇంటింటికి వాహనాలతో రేషన్ పంపిణీ చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. మండల వ్యాప్తంగా 31 రేషన్ షాపులు ఉండగా.. అందులో దాదాపు 20 వేల కుటుంబాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ డీలర్లు వాహనాలు ద్వారా ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ చేయకుండా చక్రం తిప్పుతున్నారు. 10 కిలోలకు ఎన్ని మిదిన్నర కిలోలు మాత్రమే బియ్యాన్ని ఇస్తూ తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నారు. తూకాలలో కూడా అవకతవకలు చేస్తూ పేదవాడి పొట్టకొట్టి తమ జేబులను నింపుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గతంలో ఉన్న రేషన్ డీలర్లను తొలగించి, అధికార పార్టీ నేతలు తమకు అనుకూలమైన వారిని రేషన్ డీలర్లుగా పెట్టుకుని ఆడిందే ఆటగా, పాడింది పాటగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ నుంచి బియ్యం, చక్కెర, కంది బేడలు, జొన్నలు అందిస్తుంటే డీలర్లు మాత్రం కేవలం బియ్యం, చక్కెర ఇస్తూ కంది బేడలను ఏదో తమకు అనుకూలమైన వ్యక్తులకు మాత్రమే ఇచ్చి, మిగిలిన వాటిని బయట వ్యాపారస్తులకు అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారు. రేషన్ కార్డుదారులు కంది బేడలు ఇవ్వమని అడిగితే స్టాకు రాలేదని, మీకు ఇష్టమొచ్చిన వారికి చెప్పుకోండని దురుసుగా మాట్లాడుతున్నారు. ఇసుక, గ్రావెల్ మట్టి, దందాలు, సెటిల్‌మెంట్లు చేసుకుంటూ, ప్రజాధనాన్ని కొల్లగొడుతూ.. కనీసం పేదలని చూడకుండా కంది బేడలను ఇవ్వకుండా డీలర్లు తమ ఆర్థిక స్వలాభం కోసం చూస్తున్నారు. ఎండీయూ అపరేటర్లు మాత్రం పంపిణీ చేస్తామని చెబుతున్నా డీలర్లు మాత్రం మీరు వాహనాలను ఇంటి వద్దనే పెట్టుకోండి.. ఉన్నతాధికారులతో మేము మాట్లాడుకుంటామని చెప్పుతున్నట్లు సమాచారం. మీకు మాత్రం ప్రతి నెలా వేతనాలు అందుతాయని డీలర్లు చెప్పడంతో వారు కూడా వాహనాలను తమ ఇంటి వద్దే పెట్టుకుని ఇతర పనులను చేసుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ హరినాథరెడ్డిని వివరణ కోరగా ఎండీయూ అపరేటర్లకు ప్రతి నెల రూ.21 వేలు వేతనం ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. అందులో రూ.3 వేలు వాహనం కంతు కోసం కటింగ్ పోనూ, రూ.18 వేలు ఎండీయూ ఆపరేటర్ల అకౌంట్లలో జమ అవుతున్నట్లు చెప్పారు. ఎండీయూ ఆపరేటర్లు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ ఇవ్వలేదని ఇంతవరకు మా దృష్టికి రాలేదని తెలిపారు.

గత ప్రభుత్వంలో ఇంటింటికి వచ్చి రేషన్ పంపిణీ చేసేవారు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎండీయూ ఆపరేటర్లు ఇంటింటికి వచ్చి రేషన్‌ను పంపిణీ చేసేవారు. ప్రస్తుతం రేషన్ దుకాణదారులు తూకాలను సరిగా ఇవ్వడం లేదు. అంతేకాకుండా ఇచ్చింది తీసుకోవాలని కసురుకుంటున్నారు. కనీసం పండుగలకైనా కంది బేడలు ఇవ్వాలని అడుగుతుంటే స్టాకు లేదంటున్నారు.

– షేక్ షబీనా, స్థానికురాలు, వేంపల్లె

తూకాలలో అవకతవకలు



ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని దుకాణదారులు తూకాలు సరిగా ఇవ్వకుండా అవకతవకలు చేస్తున్నారు. ఒక్కొక్కరికి ఐదు కేజీలు చొప్పున ఇద్దరికీ 10 కేజీలు బియ్యం రావాల్సి ఉండగా, కేవలం 8.50 కేజీలు మాత్రమే ఉన్నాయి. పేదల బియ్యాన్ని కూడా డీలర్లు సొమ్ము చేసుకుని పొట్ట కొడుతున్నారు. గత ప్రభుత్వంలో రేషన్ బియ్యం సక్రమంగా పంచేవారు.

– కొట్టే సుబ్బమ్మ, స్థానికురాలు, వేంపల్లె

రేపు ప్రముఖ న్యూరోసర్జన్ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ఉదయం ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. నరాల జబ్బులతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అగ్నిమాపక శాఖ అధికారిగా శివరామిరెడ్డి



వేంపల్లె : వేంపల్లె అగ్నిమాపక అధికారిగా శివరామిరెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవ రం ఫైర్ స్టేషన్‌లో పనిచేస్తున్న శివరామిరెడ్డి పదోన్నతి మీద వేంపల్లె అగ్నిమాపక కేంద్రానికి బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అగ్నిమాపక అధికారిగా బాధ్యతలు స్వీకరించి వేంపల్లె ప్రాంత పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరిగిన ప్రజలు సకాలంలో సమాచారం ఇవ్వాలని కోరారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వరి పంటలను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : రైతులు సాగు చేసిన పంట పొలాల్లో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. శుక్రవారం మండలంలోని పొడదుర్తి, లేటపల్లె గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో వరి, వేరుశనగ పంట పొలాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులు తాము సాగు చేసిన పంట పొలాల్లో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వరి పంటలో ఆకు ముడత, కాండం తొలుచు పురుగు ఆశించిందన్నారు. దీని నివారణకు క్లోరిఫైరిపాస్ 500 మి.లీ. లేదా క్లోరంతో నిలిప్రోలు 60మి.లీ.లను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. వేరుశనగ సాగు చేసే రైతులు మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. వేరుశనగ పూత దశలో 200 కిలోల జిప్సంను ఏకరాకు వేయడం వలన అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. సేంద్రీయ ఎరువులను వాడటం వలన సూక్ష్మ ధాతు లోపాలను నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తే తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంటలు పండించి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. బీజామృతము, ఘన జీవామృతము వంటి కషాయాల తయారీ, వినియోగం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వీఏఏ వికాస్, రైతులు పాల్గొన్నారు.

వాహనాలను అతివేగంగా నడపరాదు



మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసాద్

పులివెందుల రూరల్ : ప్రతి వాహనదారుడు దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు అతివేగంతో ప్రయాణం చేయకూడదని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.వి.ప్రసాద్, ఆర్టీసీ డీఎం రామకృష్ణ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజ్‌లో 36వ జాతీయ భద్రత వారోత్సవాల సందర్భంగా ఆర్టీసీ డ్రైవర్లు, కార్మికులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు చాలా వ రకు మానవ తప్పిదంవల్లే జరుగుతున్నాయని, డ్రైవర్లు నిర్లక్ష్యంగా తమ వా హనాలను ఓవర్ టేక్ చేయరాదన్నారు. రోడ్డు మలుపులలో అతివేగంతో ప్ర యాణించడంవల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. ముఖ్యంగా వా హనాలు నడిపే డ్రైవర్లకు కంటి చూపు మెరుగ్గా ఉండాలన్నారు. జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని, డ్రైవర్లు ప్రశాంత మనసుతో వి ధులకు హాజరు కావాలన్నారు. ప్రమాదం జరగకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు చెప్పే సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ కుళ్లాయప్ప, ఎస్‌బీఐ గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొ న్నారు.

పని చేసే వారికి పదవులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు దక్కుతాయని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ.అంజద్‌బాషా తెలిపారు. కడప వెస్ట్‌జోన్ అధ్యక్షుడిగా ఎంపికైన వి.నాగేంద్రారెడ్డి శుక్రవారం అంజద్‌బాషాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా, తదితరులు నాగేంద్రరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్. దాసరి శివప్రసాద్. దేవిరెడ్డి ఆదిత్య. పి.రామ్మోహన్‌రెడ్డి అజ్మతుల్లా. త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ పగడాల జగన్నాథ్

కమలాపురం : కమలాపురం మున్సిపాలిటీ పరిధిలో శనివారం నిర్వహించనున్న స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌ను విజయవంతం చేయాలని నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. శుక్రవారం స్థానిక తన ఛాంబర్‌లో పట్టణ పారిశుధ్య సెక్రటరీలు, మెప్మా ఆర్పీలు, సీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఉదయం పట్టణంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని శుభ్రం చేయడంతో పాటు కాలువల్లో పూడిక తీయడం తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు. సాయంత్రం క్రాస్ రోడ్డులో మానవహారం, గ్యాంగ్ స్వీపింగ్, ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొన్ని ఈ కార్యక్రమారన్ని విజయవంతం చేయడంతో పాటు ప్రజల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల నరసింహులు, ఓబులేసు, సీఓలు లావణ్య, ప్రజ్యోత్, మెప్మా ఆర్పీలు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్లకు సత్కారం



వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్లను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్లు హాలు గంగాధర రెడ్డి, హఫీజ్‌లను ఘనంగా సత్కరించారు. జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిశోర్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్పల చేతులమీదుగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నూర్‌బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, కౌన్సిలర్ ఖాదర్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధయ్య, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన దక్షిణ మధ్య కాలువ వంతెన



మైలవరం దక్షిణ కాలువపై అధ్వానంగా ఉన్న వంతెన



పూడికలతో నిండిన మైలవరం దక్షిణ కాలువ

ఎర్రగుంట్ల : మండలంలో ప్రధానంగా వ్యవసాయ ఆధారిత దక్షిణ మధ్య కాలువ ఉంది. ఈ కాలువ మైలవరం రిజర్వాయర్ నుంచి దక్షిణం వైపు జమ్మలమడుగు మండలంలోని సిరిగేపల్లి, సుంకేసుల గ్రామాలను కలుపుతు ఎర్రగుంట్ల మండలంలోని కలమల్ల, ఎర్రగుంట్ల పట్టణ మీదుగా కమలాపురం వరకు నీటి ప్రవాహం ఉంటుంది. కాలువ కింద లింక్ చానల్స్‌తో చెరువులు ఉన్నాయి. రైతులు ఈ కాలువ ద్వారా పంటలను పండించుకుంటున్నారు. ఈ కాలువ కింద లింక్ చానల్ ద్వారా పోట్లదుర్తి, మాలెపాడు, ఇల్లూరు, చిన్నదండ్లూరు, ఎర్రగుంట్ల, హనుమనుగుత్తి, తిప్పలూరు గ్రామాలలో రైతులు పంటలు సాగు చేస్తుంటారు. అయితే ప్రస్తుతం కాలువ ఆర్టీపీపీ ఫ్లైయాష్ బూడిదతో పూడికలు ఏర్పాడి ఉండటం ద్వారా వర్షం నీరు, మైలవరం డ్యామ్ నుంచి వచ్చే నీటి ప్రవాహంకు అడ్డంకి ఉందని రైతులు ఆవేదన వ్యకం చేస్తున్నారు. ఈ కాలువలో పిచ్చి చెట్లు విపరితంగా పెరిగిపోవడంతో నీటి ప్రవాహంకు చాలా కష్టంగా ఉంది. మేకలబాలయపల్లి గ్రామం వద్ద కాలువపై దుర్గమ్మతల్లి గుడికి వెళ్లడానికి చిన్న వంతెను నిర్మించారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరింది. ఏప్పుడైన కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు. ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.